నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 2 జూన్ 2025 | HYDERABAD




## ప్రజావాణి వాయిదా

సిటీబ్యూరో, జూన్ 1 (నమస్తే తెలంగాణ ): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నిర్వహణ సందర్భంగా సోమవారం ప్రజావాణిని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వీ కర్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని, వచ్చే వారం నుంచి ప్రజావాణి యథావిధిగా జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోనూ ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల పత్రాల పంపిణీ రసాభాస



మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 1 : ఇందిరమ్మ ఇండ్ల పత్రాల పంపిణీ కార్యక్రమం రసాభాస అయ్యింది. కాంగ్రెస్ నాయకుల మధ్య వివాదం తలెత్తింది. నాగారం మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్ వేదికపై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు న్యాయం చేసేందుకు ఇండ్ల నిర్మాణానికి 5 లక్షల రూపాయలు మంజూరు చేస్తుందని, ఎలాంటి అపోహలు పడకుండా లబ్ధిదారులు ఇండ్లు నిర్మించుకోవాలన్నారు. ఇంతలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అశోక్ గౌడ్ మధ్యలో అడ్డుకునే ప్రయత్నం చేశారు. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాలేదని, వేదిక మధ్యలో వచ్చి మల్లేశ్ యాదవ్ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. ఎంతమంది అర్హులకు ఇండ్లు మంజూరు అయ్యాయో చేతులు ఎత్తాలని కార్యక్రమానికి హాజరైన వారిని కోరారు. అనంతరం మైకును గుంజుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువురి మధ్య వివాదం తలెత్తింది. చివరకు ఇరువురి వాదోపవాదాల మధ్య రసాభాసగా కార్యక్రమం ముగిసింది.

# ఇంకెన్నాళ్లు...!!

వర్షాలు మొదలైనా పూర్తవ్వని నాలా పూడికతీత పనులు

**951.71కిలో 518 కిలోమీటర్ల మేర మాత్రమే పూర్తి**

గతేడాది గుణపాఠం నేర్వని జీహెచ్ఎంసీ




*గ్రేటర్‌లో నాలా పూడికతీత పనులపై జీహెచ్ఎంసీ అలసత్వం ప్రదర్శిస్తోంది. ఈ ఏడాది వర్షాకాలం ముందస్తుగా వస్తుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించడం, వర్షాలు కురుస్తున్నప్పటికీ పనులను వేగం పెంచడంలో మీనమేషాలు లెక్కిస్తున్నది. వాస్తవంగా గత డిసెంబర్ నెలలో నాలా పనులకు టెండర్లు ముగించాల్సిన అధికారులు.. గత నెల మొదటి వారం వరకు కొన్ని చోట్ల టెండర్లతోనే కాలాయాపన చేసింది. ఇప్పటి వరకు నాలా పూడికతీత పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ 60 శాతం కూడా పూర్తి చేసుకోకపోవడం అధికారుల పనితీరుకు అర్థం పడుతున్నది. ఈ ఏడాది రూ. 55.04 కోట్లతో 203 చోట్ల పనులకు 951.71 కిలోమీటర్ల పొడవున పూడికతీత చేపట్టాల్సిన ఉండగా, ఇప్పటి వరకు 518 కిలోమీటర్ల మేర మాత్రమే పూర్తి చేయడం గమనార్హం. – సిటీబ్యూరో, జూన్ 1 (నమస్తే తెలంగాణ )*

**దాదాపు రూ.55 కోట్ల మేర..**

ప్రతి ఏడాది దాదాపు రూ.55 కోట్ల మేర నాలా పూడికతీత పనులకు టెండర్లు పిలిచి వర్షాకాలం తొలకరి జల్లులు కురిసే నాటికల్లా పనులను పూర్తి చేసి వరద నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టాలి. కానీ జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ నిర్వహణ విభాగం మీనమేషాలు లెక్కిస్తున్నది. నేటికి 100 శాతం పనులను పూర్తి చేయలేదు. అంతేకాకుండా వానాకాలంలో పలు ప్రాంతాలు, కాలనీలు నీట మునుగుతున్నా జీహెచ్ఎంసీ గుణపాఠం నేర్వడం లేదన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. కిర్లోస్కర్ కమిటీ స్టడీ చేసిన పలు సిఫారస్సులను కూడా అమలు చేయడంలో విఫలమవుతుందన్న విమర్శలున్నాయి. అప్పట్లో వరదల నివారణ కోసం కిర్లోస్కర్ కమిటీ చేసిన సిఫార్సులను బుట్టదాఖలు చేస్తూ కాంట్రాక్టర్లు, ఆఫీసర్లు తమ బినామీ సంస్థలకు పనులను అప్పగిస్తూ తుతూ మంత్రంగా చేపడుతూ ఏటా ఏటా పూడిక పేరిట కోట్లాది రూపాయలు జేబులు నింపుకొంటున్నట్లు ఆరోపణలున్నాయి.

### ఈ ఏడాది నాలా పూడిక తీత పనుల వివరాలు (జోన్ల వారీగా)

| జోన్ | పనులు | అంచనా వ్యయం (రూ.లక్షల్లో) |
|---|---|---|
| ఎల్బీ నగర్ | 5 | 540.74 |
| చార్మినార్ | 85 | 1759.10 |
| ఖైరతాబాద్ | 61 | 1124.48 |
| శేరిలింగంపల్లి | 7 | 810.50 |
| కూకట్‌పల్లి | 6 | 638.90 |
| సికింద్రాబాద్ | 39 | 630.35 |




**వీటిలో రూ.55.04 కోట్లతో 203 చోట్ల పనులకుగానూ 951.71 కిలోమీటర్ల పొడవున పూడికతీత చేపట్టాల్సిన ఉండగా, ఇప్పటి వరకు 518 కిలోమీటర్ల మేర మాత్రమే పూర్తి చేయడం గమనార్హం.**

పుప్పాలగూడ నాలా



# నైట్ సఫారీ ఆశలు గల్లంతు

**ప్రతిపాదనలను పక్కన పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం**
**దేశంలోనే రెండో నైట్ సఫారీ ఆవిష్కరణకు గత ప్రభుత్వం చర్యలు**
**జువాలజికల్ సమస్యల పేరిట పక్కన పెట్టిన హెచ్ఎండీఏ**

సిటీబ్యూరో, జూన్ 1(నమస్తే తెలంగాణ) : దేశంలోనే రెండో అతిపెద్ద నైట్ సఫారీ పార్క్ ప్రతిపాదనలు అటకెక్కాయి. విదేశీ తరహాలో నిశాచర వన్య మృగాలతో పర్యాటక ప్రాంతాన్నీ అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో తీర్చిదిద్ది కార్యరూపంలోకి తీసుకొచ్చినా... కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే ఈ ప్రాజెక్టు నిలిచిపోయింది. నగరంలోని అవుటర్ రింగు రోడ్డుకు సమీపంలో ఉన్న కొత్వాల్‌గూడ ఎకో పార్కు వద్ద, హిమయత్ సాగర్ సమీపంలో ఈ ప్రాజెక్టును చేపట్టగా... హెచ్ఎండీఏ డిజైన్లు సిద్ధం చేసింది. దాదాపు 85 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టగా... అందుకు నిధులు, నిర్వహణ వ్యయం, ప్రాజెక్టు వివరాలతో సమగ్రమైన నివేదిక కూడా సిద్ధం చేసింది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే ఈ ప్రాజెక్టు కనుమరుగైపోయింది.

### సింగపూర్ తరహాలో..

సింగపూర్ నైట్ సఫారీ తరహాలో నగరంలో అరుదైన వన్య మృగాలతో నైట్ సఫారీ ఏకో పార్క్ నిర్మించేలా హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించిన వివరాలతో సాధ్య అసాధ్యాలను వివరిస్తూ నివేదిక రూపొందించారు. దీంతో నగరం దేశంలోనే రెండో నైట్ సఫారీ కలిగిన ప్రాంతంగా మార్చేలా సిద్ధం చేసిన ప్రణాళికలన్నీ



మిగతా II లో..

# నార్త్ సిటీకి మెట్రో ఇంకెప్పుడు?

## 150 రోజులుగా ఎదురుచూస్తున్న అక్కడి ప్రజలు

సిటీబ్యూరో, జూన్ 1(నమస్తే తెలంగాణ) : నార్త్ సిటీ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలంటూ 152 రోజులుగా ఎదురుచూస్తున్నారు. మెట్రో విస్తరణ పేరిట ఆ ప్రాంతానికి రెండు మార్గాల్లో మెట్రో మార్గాన్ని తీసుకువస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారే తప్పా... ఇప్పటికీ డీపీఆర్ పూర్తి చేయలేకపోయారు. ఇక తమ ప్రాంతానికి ఎంతో కీలకమైన మెట్రో డీపీఆర్ ఇంకెప్పుడూ అంటూ మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆందోళన చెందుతున్నది. నార్త్ సిటీ మెట్రో నిర్మాణంలో కీలకమైన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను మార్చి 31లోపు ప్రభుత్వానికి డీపీఆర్ అందజేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించినా... ఇప్పటికీ రూపకల్పన ప్రక్రియ సాగుతున్నదని మెట్రో రైలు సంస్థ వెల్లడించడంపై మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. ఈ క్రమంలో నిర్ణీత గడువులోగా

మిగతా IVలో..

## అర్హులకే డబుల్ బెడ్రూంలు కేటాయించాలి



పోచారం, జూన్ 1: ప్రతాపసింగారంలోని డబుల్‌బెడ్రూం ఇండ్లను అర్హులకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు ఆదివారం ఆందోళనకు దిగారు. ప్రతాపసింగారంలోని 90 డబుల్ బెడ్రూం ఇండ్లను అసలైన అర్హులకు కాకుండా కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు కేటాయించారని ఆరోపిస్తూ.. మాజీ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, ప్రతాపసింగారం గ్రామ మాజీ సర్పంచ్ శివశంకర్ ఆధ్వర్యంలో లబ్ధిదారులు నిరసన తెలిపారు. ప్రతాపసింగారంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్డు పై బైఠాయించి ఆందోళన చేసిన లబ్ధిదారులు.. అనంతరం డబుల్ బెడ్రూం ఇండ్ల వరకు ర్యాలీగా వెళ్లి ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న మేడిపల్లి పోలీసులు అరెస్టు చేసి నాయకులను, లబ్ధిదారులను స్టేషన్‌కు తరలించారు.

## యుద్ధ ప్రాతిపదికన పనులు చేయండి

సిటీబ్యూరో, జూన్ 1 (నమస్తే తెలంగాణ ) : మలక్‌పేటలో డ్రైనేజీ నీరు ఉప్పొంగడంతో ఏర్పడిన ట్రాఫిక్ జామ్ నివారణకు చేపట్టిన పనులను కమిషనర్ ఆర్ వీ కర్ణన్ ఆదివారం పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ట్రాఫిక్ జామ్‌కు అవకాశం లేదని, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని, భవిష్యత్‌లో సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి వివరించారు. అనంతరం నెక్లెస్ రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి కుందన్ బాగ్ వరకు చేపట్టే ఆర్‌డీపీ పనులను పరిశీలించారు.




## సరసమైన ధరకు ఫ్లాట్స్ అంటూ..

# రూ. 300 కోట్లకు పైగా వసూలు

- పోలీసులు, ఈడీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు
- మీడియా ఎదుట బాధితుల ఆవేదన



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న బాధితులు

ఖైరతాబాద్, జూన్ 1 : సరసమైన ధరకు ఫ్లాట్స్ పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేసి మోసగించి రియల్ ఎస్టేట్ సంస్థపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాధితులు మావర్మకుమార్, మూర్తి శ్రీనివాస్, ప్రసాద్ శివపురం, గణేశ్, ఫణిలు మాట్లాడుతూ 2021లో జయత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (జయ గ్రూప్)కు చెందిన కొందరు మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్స్ తమను ఫోన్‌లో సంప్రదించారని, చందానగర్, గోపన్‌పల్లి, కూకట్‌పల్లిలోని తమ ప్రాజెక్టుల్లో అన్ని హంగులు కలిగిన ఫ్లాట్స్ తక్కువ ధరలో అందుబాటులో ఉన్నాయని చెప్పారన్నారు. అప్పటికే సదరు సంస్థ 20 ప్రాజెక్టులు చేపట్టిందని ప్రచారం చేయడంతో వారి మాటలకు ఆకర్షితులమై ఫ్లాట్స్ కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. చందానగర్‌లోని హిల్టన్ పేరిట ఉన్న ప్రాజెక్టును చూపించారని, సుమారు 800 ఫ్లాట్స్ ఉన్నాయని, ముందస్తుగా కొంత చెల్లిస్తే 2023 వరకు ఫ్లాట్స్ అప్పగిస్తామని చెప్పారన్నారు. దీంతో రూ. 20 లక్షల నుంచి రూ. 1.80 లక్షల వరకు 400 మంది చెల్లించారన్నారు. గడువు దాటినా ఫ్లాట్స్ అప్పగించకపోవడంతో తాము ఆ సంస్థ ఎండీని నిలదీశామన్నారు. కొందరికి డబ్బులు వాపసు చెల్లిస్తామని, మరికొందరికి చెక్కులు అందించారని, అవి బౌన్స్ అయ్యాయన్నారు. అంతేకాకుండా ఆ ఫ్లాట్స్ చూపించిన స్థలం గురించి విచారణ జరుపగా, అది వేరే సంస్థకు సంబంధించిదని, ఆ సంస్థతో ఎంవోయూ చేసుకొని తమకు తప్పుడు ఫ్లాట్స్ చూపించి మోసగించినట్లు గ్రహించామన్నారు. కూకట్‌పల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సంస్థ యజమానిపై పలు సెక్షన్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సంస్థ ఎండీతో పాటు 10 మంది డైరెక్టర్లు సుమారు 1500 మంది వద్ద వసూలు చేసి రూ. 300 కోట్లకు పైగా మోసం చేశారని వెలుగుచూసిందన్నారు. పోలీసులతో పాటు ఈడీకి సైతం ఫిర్యాదు చేశామని, సదరు సంస్థపై విచారణ జరిపించి యాజమాన్యంపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలన్నారు.

# సకాలంలో వైద్యం ఎండమావే..!

## ఏరియా ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత

- సివిల్ సర్జన్లు, రేడియాలజిస్టులు, ఫార్మసిస్టు పోస్టులు ఖాళీ
- మలక్‌పేట, నాంపల్లి, గోల్కొండ ఏరియా ఆసుపత్రుల్లో ఇదీ పరిస్థితి
- పరీక్షల కోసం ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్న రోగులు
- ఖాళీలను భర్తీ చేయడంలో కాంగ్రెస్ సర్కారు విఫలం




సిటీబ్యూరో, జూన్ 1 (నమస్తే తెలంగాణ): నిత్యం పేదప్రజలకు అందుబాటులో ఉంటూ వందలాది మంది రోగులకు వైద్యసేవలందించే ఏరియా ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత వెంటాడుతున్నది. సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఉన్న వారిపైనే అధిక భారం పడుతున్నది. మరోవైపు సిబ్బంది కొరత కారణంగా సకాలంలో వైద్యమందించడంలో ఏరియా ఆసుపత్రులు విఫలమవుతున్నాయి. ఇటీవల జరిగిన బదిలీల్లో పలువురు ఇతర జిల్లాలకు వెళ్లడం మూలంగా ఖాళీలు ఏర్పడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రెగ్యులర్ వారితో భర్తీ చేయకపోవడంతో సకాలంలో వైద్యమందక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**తీవ్రప్రభావం..**

హైదరాబాద్ జిల్లాలోని నాంపల్లి, మలక్‌పేట, గోల్కొండ ప్రాంతాల్లో ఉన్న 100 పడకల ఏరియా ఆసుపత్రులు తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) పరిధిలో పనిచేస్తూ బస్తీ, యూపీహెచ్‌సీల తరువాత వైద్య సేవలందించడంలో ముందున్నాయి. చాలా వరకు అత్యవసరపు చికిత్సలు, శస్త్ర చికిత్సలు, ప్రసవాలు ఏరియా ఆసుపత్రుల్లోనే జరుగుతుండటం గమనార్హం. కానీ వాటిల్లో సరిపడా సిబ్బంది లేక ఖాళీలు దర్శనమిస్తున్నాయి. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ , పీడియాట్రిక్స్, గైనకాలజీ, అనస్తీషియా, ఫార్మసిస్టు, రేడియాలజిస్టు పోస్టులు భర్తీకి దూరంగా ఖాళీగా ఉన్నాయి. నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో ఏడుగురు సివిల్ సర్జన్లు కావాల్సి ఉండగా, ముగ్గురు మాత్రమే ఉన్నారు. గోల్కొండ ఆసుపత్రిలో ఆరుగురికి ఇద్దరే ఉన్నారు. మలక్‌పేట ఏరియా ఆసుపత్రిలో ఏడుగురు వైద్యులకు ఇద్దరు మాత్రమే ఉండటం గమనార్హం. మరీ ముఖ్యంగా పీడియాట్రిక్, అనస్తీషియా విభాగాల్లో ఖాళీలు ఉండటం మూలానా అత్యవసర సమయాల్లో తీవ్ర ప్రభావం చూపుతున్నది.

మిగతా II లో..




ఉప్పల్-నారపల్లి మార్గంలో ఫ్లైఓవర్ నిర్మాణం నత్తనడకన సాగుతుండటంతో వాహనదారులు నిత్యం నరకయాతన పడుతున్నారు.